ప్రగతి పరుగులు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసిన సంగతి తెలిసిందే. గత ప్రభుత్వంలో జీవీఎంసీ వార్డుల అభివృద్ధిని ఏనాడు పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ సర్కారు అధికారంలోకి వచ్చాక వార్డులను ఆధునికంగా తీర్చిదిద్దుతున్నారని జనం కితాబిస్తున్నారు. మౌలిక వసతులను కల్పించడంతోపాటు రోడ్లు, కాలువలు, డ్రైనేజీలు, సామాజిక, అంగన్‌వాడీ భవనాలు ఇలా ప్రజలకు అవసరమైనవన్నీ నిర్మిస్తున్నారు.

- 53వ వార్డులో అభివృద్ధి జోరు
- కోట్ల రూపాయలతో నిర్మాణాలు
- సీఎం పాలనపై స్థానికుల హర్షం

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు ప్రగతి పథంలో దూసుకుపోతోంది. ఏడాదిన్నరగా అనేక అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వార్డు అభివృద్ధిలో భాగంగా కోట్ల రూపాయలు వెచ్చించి రోడ్లు, డ్రైయిన్లు, గెడ్డలు, కల్వర్టులు ఇలా అన్నిటినీ జీవీఎంసీ అధికారులు నిర్మించారు. కొన్ని నెలల ముందు రూ.3.43 కోట్లతో మద్రిపాలెంలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైయిన్లు, గెడ్డలు, కల్వర్టుల నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, కార్పొరేటర్ బర్కత్ అలీతో కలిసి శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. దాదాపు ఆ ప్రాంతమంతా నిర్మాణ పనులు పూర్తయ్యాయి.


శ్రీహర్షనగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులు

కాలనీల్లో చకచకా పనులు

- శ్రీహర్షనగర్‌లో 20 ఏళ్లుగా రాళ్లు, మట్టి రోడ్డు ఉండేది. ఈ ప్రాంతంలో ప్రస్తుతం సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు.


శివనగర్ గెడ్డ వద్ద నిర్మించిన కాంక్రీట్ గోడ


శివనగర్‌లో హిందూ శ్మశానవాటిక వెనుక నిర్మాణంలో రక్షణ గోడ


53వ వార్డు ఆంధ్రకేసరి నగర్‌లో నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవనం



- శివనగర్‌లో గెడ్డకు సబంధించి ఇళ్లకు ఆనుకుని ఉన్న గోడ నిర్మాణం కొంతమేర జరిగింది. వర్షాలు పడితే గోడలు నానిపోయి పడిపోవడంతో నివాసులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. గెడ్డలో చెత్తాచెదారంతో పేరుకుపోయి ఈగలు, దోమలు, విష పురుగులు చేరడం వల్ల అనారోగ్యం బారిన పడేవారు. ఇప్పుడు గోడ పూర్తిగా నిర్మిస్తుండటంతో ఇబ్బందులు తొలగనున్నాయి.
- ప్రస్తుతం వార్డుకు సంబంధించిన అంగన్‌వాడీ కేంద్రం శివనగర్‌లోని ఓ అద్దె ఇంట్లో ఉంది. ఆంధ్రకేసరి నగర్‌లో ప్రభుత్వం సొంత భవనాన్ని నిర్మిస్తుంది. త్వరలోనే దీనిలోకి అంగన్‌వాడీ కేంద్రాన్ని తరలిస్తారు.
- శివనగర్‌లో హిందూ శ్మశానవాటికకు సంబంధించి రూ.43.50 లక్షలు మంజూరు కాగా.. అందులో ఒక పక్క రక్షణ గోడ నిర్మాణం పూర్తయ్యి 6 నెలలు దాటింది. అప్పట్లో వర్షాల కారణంగా వెనుక ఉన్న రక్షణ గోడ కూలిపోవడంతో ఇప్పుడు దాని నిర్మాణం ప్రస్తుతం జరుగుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధపెట్టి వార్డును అభివృద్ధి పథంలో నడిపిస్తుండటంపై ఆయా ప్రాంతాల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

20 ఏళ్ల కల సాకారం



నా చిన్నతనం నుంచి అంటే 20 ఏళ్లుగా శ్రీహర్షనగర్‌లో రహదారుల దుస్థితిని ఎవరూ పట్టించుకోలేదు. నాయకుల చొరవతో మా ప్రాంతానికి మంచిరోజులు వచ్చాయి. మొత్తం వార్డు అంతా అభివృద్ధి చేయడం చాలా ఆనందంగా ఉంది. వీధి లైట్లు కూడా వెలుగుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు.

– తరుణ్ సంపత్‌కుమార్, శ్రీహర్షనగర్, 53వ వార్డు

సీఎం జగన్‌ను కలిసిన కె.కె.రాజు



శారదా పీఠం వార్షికోత్సవంలో పాల్గొనేందుకు బుధవారం విశాఖ విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్‌ఏడీ నుంచి గోపాలపట్నం వరకు కె.కె.రాజు ఆధ్వర్యంలో భారీగా అభిమానులు, మహిళలు, కార్యకర్తలు హాజరై శారదా పీఠానికి వెళ్తున్న సీఎం జగన్‌కు ఘన స్వాగతం పలికారు.

– సీతమ్మధార

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'గ్రీవెన్స్'

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. పలువురు ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. వాటిని కె.కె.రాజు పరిశీలించి కొన్నింటిని పరిష్కరించారు. మిగిలిన అర్జీలను సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

విద్యార్థులకు ఒత్తిడి లేని విద్య


ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లకు సూచనలిస్తున్న ఇంటర్మీడియట్ బోర్డ్ ఆర్‌ఐవో మురళీధర్

సీతంపేట: విద్యార్థులకు ఒత్తిడి లేకుండా విద్యను అందించాలని ఇంటర్మీడియట్ బోర్డ్ ఆర్‌ఐవో మురళీధర్ అన్నారు. ఇంటర్మీడియట్ బోర్డ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక శ్రీవిశ్వ కళాశాలలో స్ట్రెస్ మేనేజ్‌మెంట్, ఆత్మహత్యల నివారణ అంశంపై కళాశాలల ప్రిన్సిపాళ్లు, లెక్చరర్స్, జేఎల్స్‌కు జరిగిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్, లెక్చరర్స్, జూనియర్ లెక్చరర్స్ తగు జాగ్రత్తలు వహించాలన్నారు. విద్యార్థులు ఒత్తిడికి గురైనట్టు కనిపిస్తే వారికి కౌన్సెలింగ్ ఇచ్చి ఆత్మస్థైర్యం కలిగించాలని సూచించారు. ఇటీవల కాలంలో విద్యార్థుల ఆత్మహత్యలు చోటుచేసుకున్న కారణంగా ప్రభుత్వం ముందస్తు చర్యలకు ఉపక్రమించిందన్నారు. విద్యార్థుల ఆత్మహత్యలు మరెక్కడా సంభవించకుండా కళాశాల యాజమాన్యాలను అప్రమత్తం చేసేలా రెండు రోజుల పాటు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ట్రైనర్ జి.రవి. శ్రీవిశ్వ డైరెక్టర్ సూర్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్స్, లెక్చరర్స్ పాల్గొన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణోత్సవం


సీతారాములకు పూజలు చేస్తున్న దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష దంపతులు

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో బుధవారం సీతారాముల కల్యాణం, పట్టాభిషేక మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి గణపతి పూజ అనంతరం కల్యాణం, పట్టాభిషేకం 1.30 గంటల వరకు జరిపారు. ఆలయంలో ఈ నెల 12 నుంచి 21 వరకు పది రోజుల పాటు శ్రీమద్రామయణ పారాయణం నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష దంపతులు సీతారాములను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సత్యసాయినగర్‌లో అన్నదానం


అన్నదానంలో కంపా హనోకు, పైడి రమణ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు సత్యసాయినగర్‌లో శ్రీసత్యసాయి సంక్షేమ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో విజయదుర్గాదేవి ఆలయ 18వ వార్షికోత్సవంలో భాగంగా బుధవారం అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథి కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, కాలనీ అధ్యక్షుడు కారుకొండ రాజు, బొడ్డేటి శ్రీనివాస్, పి.ఎస్.రామారావు, లింగంపల్లి రవిశంకర్, వాసుపల్లి ఎల్లాజీరావు, తిప్పానా ఆదినారాయణ, మడక పైడిబాబు, కారుకొండ కనకరాజు, కె.సూరిబాబు, యు.రమణ, వెంకట్, శ్రీను, సూరి, సత్యసాయినగర్ యూత్ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు.

రూ.41 లక్షలతో సామాజిక భవనం

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు 80 ఫీట్ రోడ్‌లోని బ్రహ్మం గారి ఆలయం వద్ద రూ.41 లక్షలతో రెండంతస్తుల సామాజిక భవనం నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన జరిగింది. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు శంకుస్థాపన చేశారు. పార్టీ 45వ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, జేసీఎస్ మండల కన్వీనర్ బులుసు జగదీష్, ఏఈ రమణమ్మ, స్థానిక నాయకులు బాణాల తరుణ్, బైర వెంకట్, చలం, సీతారాం, కాయల రామారావు, గోపి, దుర్గ, హైమ, నాగమణి, సతీష్, తులసీరాం, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


శంకుస్థాపనలో పాల్గొన్న కె.కె.రాజు, బాణాల శ్రీనివాస్, పెద్దిశెట్టి ఉషశ్రీ

అభివృద్ధిపనులకు శంకుస్థాపన

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలో పలు అభివృద్ధి పనులకు బుధవారం వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు.. కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. వార్డులో వరద నీటి కాలువ పునర్నిర్మాణానికి రూ.59.55 లక్షలు, సీసీ రోడ్లు, కాలువల పునర్నిర్మాణానికి రూ.39.22 లక్షల జీవీఎంసీ సాధారణ నిధుల నుంచి మంజూరైనట్లు జీవీఎంసీ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ బులుసు జగదీష్, జీవీఎంసీ ఏఈ రమణమ్మ, కో ఆప్షన్ సభ్యుడు షరీఫ్, డైరెక్టర్లు ఎస్.ప్రసాద్, నాగమణి, పార్టీ 42వ వార్డు నాయకులు ఆళ్ల శ్రీనవాసరావు, రమణమూర్తి, గణేష్, మాధవ, సురేంద్రలాల్, స్వర్ణ, గౌరి, లక్ష్మి, బ్రహ్మాజీ, లోకేష్, శ్రీనివాసరెడ్డి, కృష్ణవేణి, నూకరాజు, షాజహాన్, శ్రీనివాస్, పద్మరాజు, పద్మా, సాయి, లోకేష్, భాను, వెంకటరావు, భగవతిరావు, రిజ్వాన్ ఖాన్, నాగరాజు, తులసి, ఆళ్ల గోపి, గ్రామ పెద్దలు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, మహిళలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


రైల్వే న్యూకాలనీలో శంకుస్థాపన చేస్తున్న కె.కె.రాజు, ఆళ్ల లీలావతి

సామెతలు, జాతీయాలు గొప్ప సంపద

సీతంపేట: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో 'తెలుగు పలుకుబడులు, వైచిత్రి' అనే అంశంపై రచయిత, డాక్టర్ డి.వి.సూర్యారావు ప్రసంగించారు. తెలుగు భాషకు సామెతలు, జాతీయాలు గొప్ప సంపదని అభివర్ణించారు. తెలుగు జాతికి, తెలుగు భాషకు సొంతమై పరభాషలోకి అనువదించి చెప్పలేనివి ఆ జాతి సంస్కృతిని ప్రతిబింబించేవి జాతీయాలుగా పేర్కొన్నారు. ఇంచుమించుగా వాటినే పలుకుబడులుగా పరిగణిస్తామన్నారు. కొన్ని పదబంధాలలో ఇమిడి ఉన్న అర్థాలను వివరించారు. కార్యక్రమంలో సహృదయ సాహితి సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్, ఎస్.విజయ్‌కుమార్, సిహెచ్.చిన సూర్యనారాయణ, పరవస్తు ఫణిశయన సూరి, కొత్తూరి రమణ, కె.భీమేశ్వరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ డి.వి.సూర్యారావు

ఎంప్లాయీస్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

మహారాణిపేట : ఏపీ ఎంప్లాయీస్ అసోసియేషన్ 2024 డైరీని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ అధికారి డాక్టర్ డి.సుజాత ఆవిష్కరించారు. బుధవారం ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏపీజీఈఏ రాష్ట్ర కార్యదర్శి వి.ఎం.జవహర్‌లాల్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వి.రమణ, వి.రాజేశ్వరి, సిటీ కోశాధికారి ఆర్.మురళీకృష్ణ, జాయింట్ సెక్రటరీ వి.ప్రసాద్ పాల్గొన్నారు.


డైరీ ఆవిష్కరిస్తున్న సుజాత తదితరులు

మతోన్మాదాన్ని వ్యతిరేకించాలి

సీతంపేట: మతోన్మాద శక్తులు అధికారం చేపడితే ఎదురయ్యే ప్రమాదం గత పదేళ్లుగా కనిపిస్తోందని రచయిత్రి కె.ఎన్.మల్లీశ్వరి అన్నారు. రెడ్ బుక్స్ డేను పురస్కరించుకుని మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 'ఫాసిజం మూలాలు' అనే పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చరిత్రను వక్రీకరించి పాఠ్యాంశాలుగా ప్రవేశపెడుతున్నారన్నారు. మతోన్మాదాన్ని పెంచి హిందువులను ఓటు బ్యాంకుగా మలుచుకోవడంలో ఆర్ఎస్ఎస్, విశ్వ హిందూ పరిషత్‌లు విజయవంతమయ్యాయని పేర్కొన్నారు. మనదేశంలో మత ఘర్షణలు హిందూ, ముస్లింల మధ్య జరుగుతాయన్న అభిప్రాయం ప్రజల్లో కలిగించారన్నారు. ఏ మతంలో అయినా మతోన్మాదాన్ని వ్యతిరేకించాలని మల్లీశ్వరి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇప్టా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, సి.ఎన్.క్షేత్రపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయిత్రి మల్లీశ్వరి

27న శ్రీకృష్ణ మందిర వార్షికోత్సవం

కంచరపాలెం: ఈ నెల 27న గొల్లకంచరపాలెం లోని శ్రీకృష్ణ మందిర వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు గోకాడ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ఆరోజు వేకువజాము 5 గంటలకు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. ఉదయం 7 గంటల నుంచి స్వామికి విశేష పూజలు, మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం భజన సంకీర్తన కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులు తరలిరావాలని ఆయన కోరారు.


ముస్తాబవుతున్న ఉత్సవ విగ్రహం

'ఆరోగ్య సురక్ష'తో ఎంతో మేలు


పేర్లు నమోదు చేయించుకుంటున్న పేషెంట్లు


కంటి వైద్య పరీక్షలకు వచ్చిన స్థానికులు

మద్రిపాలెం: ప్రభుత్వం ఎంతో లాంఛనంగా ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి మంచి స్పందన వస్తోంది. ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ ద్వారా పేదల ప్రజలకు ఎంతో మేలు జరుగుతోంది. జీవీఎంసీ 53వ వార్డు మద్రిపాలెం శివనగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 298 లక్ష్మీనగర్ సచివాలయానికి సంబంధించి బుధవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. సాధారణ, ఆర్థోపెడిక్, కంటి, చెవి, ముక్కు, గొంతు(ఈఎన్‌టీ) స్పెషాలిటీ డాక్టర్లు వైద్యం చేశారు. 512 మంది రోగులు వైద్య సేవలు పొందారు. 287 టెస్టులు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నరాలకు సంబంధించి ఒకరిని న్యూరో(ప్రభుత్వ) ఆస్పత్రికి రిఫరల్ చేశారని యూపీహెచ్‌సీ సిబ్బంది తెలిపారు.

వైద్య శిబిరం పరిశీలన

సీతంపేట: దాడి రామ్మూర్తి కల్యాణ మండపంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరం నిర్వహించారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని మెడికల్ క్యాంప్‌ను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది రోగులకు నిర్వహిస్తున్న వైద్య సేవలు, రక్త పరీక్షల వివరాలు, ఇస్తున్న మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఖరీదైన వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేశారన్నారు. దాడి రామ్మూర్తి కల్యాణ మండపంలో పట్టణ ఆరోగ్య కేంద్రం ఏర్పాటుతో 42, 43, 44 వార్డుల ప్రజలకు వైద్య సేవలు బాగా చేరువయ్యాయని చెప్పారు. వైద్యులు, సిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించి, ప్రభుత్వానికి మంచిపేరు తేవాలన్నారు. కార్యక్రమంలో పిల్లా గోపి, మహదాస్యం గోపి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు

ఆకతాయిలకు కౌన్సెలింగ్

సీతమ్మధార: నగరంలో రాత్రి పూట వాహనాలపై చక్కర్లు కొడుతున్న కొందరు ఆకతాయి యువకులకు బుధవారం ఫోర్త్‌టౌన్ క్రైం పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. అర్ధరాత్రి వేళ రోడ్లపై అనవసరంగా తిరగకూడదని, మళ్లీ కనిపిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ భాస్కరరావు హెచ్చరించారు.

తుక్కు వ్యాపారులతో సమావేశం

ఫోర్త్‌టౌన్ క్రైం పోలీస్ స్టేషన్ పరిధిలోని తుక్కు వ్యాపారులతో క్రైం ఎస్ఐ భాస్కరరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి షాపు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. దుకాణానికి వచ్చి వెళ్లేవారు కనిపించేలా హై క్వాలిటీ సీసీ కెమెరాలు అమర్చాలన్నారు. షాపు వద్దకు వచ్చి విక్రయించే వారి వివరాలను రికార్డులో నోట్ చేసుకోవాలని, బైక్‌లు తీసుకొచ్చిన వారి వివరాలు సేకరించాలని సూచించారు.


ఆకతాయిలకు కౌన్సెలింగ్ చేస్తున్న క్రైం ఎస్ఐ భాస్కరరావు

ఎరుకుమాంబకు జలాభిషేకం


అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం పంచామృతాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి భక్తులు స్వయంగా జలాభిషేకం చేశారు. ఆలయ ఈవో జి.వి.రమాబాయి ఆధ్వర్యంలో అర్చకులు శ్రీనివాసరావు, కేవీకే శాస్త్రి భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మాతృభాషతోనే మానసిక వికాసం

కంచరపాలెం: మానవ వికాసం, మనుగడ మాతృభాషతోనే సాధ్యమని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ అన్నారు. జ్ఞానాపురంలోని కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హిందీ విభాగాధిపతి డాక్టర్ పి.కె.జయలక్ష్మి, అంతర్ కళాశాలల అకడమిక్ నేతృత్వంలో విద్యార్థులకు మాతృభాషపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ షైజీ మాట్లాడుతూ మాతృభాషలో పట్టు సాధించిన విద్యార్థులు విద్యారంగంలో బాగా రాణిస్తారన్నారు. డాక్టర్ జయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల సృజనకు పదును పెడుతూ నిర్వహించిన పోటీలు భవిష్యత్తుకు బాటలు వేస్తాయని చెప్పారు. సుమారు 12 కళాశాలలకు చెందిన విద్యార్థులు వేడుకల్లో భాగస్వాములయ్యారని తెలిపారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ వీణా స్పందన, సిస్టర్ జైన్ థామస్, డాక్టర్ నిర్మల, డాక్టర్ ఎస్.దీప్తి, డాక్టర్ గౌరీనాయుడు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో అతిథులు, అధ్యాపకులు

వైభవంగా వేంకటేశ్వర కల్యాణం

సీతంపేట: లలితా నగర్ శ్రీలలితా పీఠంలో జరుగుతున్న అమృతోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం శ్రీభూనీలా సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో కుర్తాళం పీఠ పురోహితుడు మాచవోలు రమేష్ శర్మ నేతృత్వంలో వేద మంత్రాల నడుమ మేళతాళాలతో కనులపండువగా కల్యాణం జరిపించారు. సుమూహూర్తం, మాంగల్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలు కళ్లకు కట్టినట్టు చూపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, తలంబ్రాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతీ స్వామిని పాల్గొన్నారు. గురువారం సాయంత్రం 6.30 గంటలకు లలితా కామేశ్వరుల కల్యాణోత్సవం జరుగుతుందని లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.


లలితా పీఠంలో వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ఎంవీపీ కాలనీ: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ద్వారకా జోన్ క్రైం సీఐ శ్రీనివాసరావు అన్నారు. సైబర్ క్రైమ్స్, పోక్సో, గంజాయి చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంవీపీ కాలనీలోని వీఎంసీ కళాశాలలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ తెలిసి తెలియని వయసులో నేరాలకు పాల్పడి ఎంతో మంది విద్యార్థులు జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. పెరుగుతున్న టెక్నాలజీని వినియోగించి సోషల్ మీడియాలో పక్కవారిపై అవమానకర పోస్టులు పెడుతూ కష్టాలను కొనితెచ్చుకోవద్దన్నారు. సైబర్ క్రైమ్ చట్టాలను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ చదువుకునే సమయంలో విద్యార్థులు పూర్తిగా వారి లక్ష్యాలపై దృష్టిసారించి భవిష్యత్‌ను ఉన్నతంగా నిర్మించుకోవాలన్నారు.